
సాక్షి నంద్యాల


శుక్రవారం ׀ 2 ׀ ఆగస్టు ׀ 2024



'మరక' మంచిదే!

ఏసీబీ కేసులు, అవినీతి, విధుల పట్ల అలసత్వం వంటి ఆరోపణలు ఉన్న పోలీస్ ఇన్‌స్పెక్టర్లకు బదిలీల్లో కీలక స్థానాలు దక్కడం చర్చనీయాంశంగా మారింది.

8లో▸



ఉచిత ఇసుకలో అక్రమాల మేట!

ఉచిత ఇసుక విధానంలో అక్రమాలు మేట వేస్తున్నాయి. భారీగా డంప్‌లు దొరికినా కేసులు పెట్టకుండా జరిమానాలతో అక్రమ సంపాదనకు తెర తీస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,631.02
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:97.945
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:2,01,636
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:1,79,936

న్యూస్‌రీల్

సబ్సిడీపై నిత్యావసర సరుకులు



కందిపప్పును అందిస్తున్న డీఎస్‌ఓ వెంకటరాముడు

నంద్యాల(అర్బన్): సబ్సిడీపై ప్రభుత్వం అందించే నిత్యావసర సరుకులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారి వెంకటరాముడు అన్నారు. స్థానిక మార్కెట్‌యార్డులో వినియోగదారుల వ్యవహారాలు ఆహార, పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో సబ్సిడీ సరుకుల కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్‌ఓ మాట్లాడుతూ కిలో కందిపప్పు రూ.150, బియ్యం రూ.48 వినియోగదారులకు అందిస్తున్నారన్నారు. అలాగే పోలూరులో జరిగిన కార్యక్రమంలో కందిపప్పు, సబ్సిడీ బియ్యంను ప్రజలకు అందించారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

శనగల బసవన్నకు పరోక్ష సేవ



శనగల బసవన్నకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు


శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ ప్రాంగణంలోని శనగల బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి గురువారం త్రయోదశి సందర్భంగా శాస్త్రోక్తంగా పరోక్ష సేవగా అర్చకులు విశేషపూజలు నిర్వహించారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పంజాబ్, పశ్చిమబెంగాల్ కూడా భక్తులు ఈ విశేషపూజను నిర్వహించుకున్నారు. ఇందులో భాగంగా ప్రదోషకాల సమయంలో నందీశ్వరునికి పంచామృతాలతో అభిషేకాది అర్చనలను నిర్వహించారు. ఆరంభ పూజలలో భాగంగా లోక క్షేమాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. అనంతరం ఈ కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు గణపతి పూజను చేశారు. తరువాత నందీశ్వర స్వామికి నూతన వస్త్రసమర్పణ విశేషార్చనలను, నానపెట్టిన శనగలను ప్రత్యేక నైవేద్యాన్ని సమర్పించి కర్పూరనీరాజనాలు అర్పించారు.

ఉరుకుంద ఉత్సవాలకు సీఎఫ్‌ఓగా గురుప్రసాద్

కర్నూలు కల్చరల్: కౌతాళం మండలం ఉరుకుంద గ్రామంలో నిర్వహించనున్న శ్రీ నరసింహ ఈరన్న స్వామి శ్రావణమాస ఉత్సవాలకు చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ (సీఎఫ్‌ఓ)గా దేవదాయ శాఖ కర్నూలు డిప్యూటీ కమిషనర్ పట్టెం గురుప్రసాద్‌ను నియమించారు. అలాగే జ్యూవెలరీ వెరిఫికేషన్ ఆఫీసర్ పాండురంగారెడ్డి, కర్నూలు అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి అసిస్టెంట్ చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్లుగా నియమితులయ్యారు. వీరితో పాటు వివిధ క్యాడర్లలో ఉన్న 24 మంది ఉద్యోగులు, సిబ్బందిని ఉత్సవాల విధులకు కేటాయించారు. వీరు శ్రావణ మాసం మొత్తం విడతల వారీగా విధుల్లో పాల్గొననున్నారు.

వడ్డీస్తారు.. వేధిస్తారు

- కోరలు చాస్తున్న మైక్రో ఫైనాన్స్ సంస్థలు
- జిల్లాలో 20 సంస్థల వడ్డీ వ్యాపారం
- గ్రామాలు, శివారు కాలనీల ప్రజలే లక్ష్యంగా రుణాలు
- ప్రతి వారం వసూళ్లు.. ఒక్క కంతు చెల్లించకున్నా వేధింపులు



గేదెను అమ్మి.. కంతు కట్టి

రుద్రవరం మండలం ఆలమూరు గ్రామంలో 10 మంది సభ్యులు ఓ మైక్రో ఫైనాన్స్ సంస్థలో తలా రూ. 10 వేల చొప్పున రుణం తీసుకున్నారు. అయితే ఓ ఒంటరి మహిళ ఆరోగ్యం బాగా లేక ఒక వారం కంతు చెల్లించలేదు. ఆమె వచ్చి కంతు చెల్లించే వరకు 9 మంది ఇక్కడే కూర్చోవాలని సంస్థ సిబ్బంది హుకూం జారీ చేశారు. ఆమె పరిస్థితిని చూసిన గ్రూపులోని మరో మహిళనే కట్టేసింది. ఆ తర్వాత వారం కూడా బాధితురాలు కంతు చెల్లించక పోవడంతో గ్రూపు సభ్యులందరూ ఇంటిమీదకు పోయి గొడవ పడ్డారు. దీంతో మనస్తాపంతో ఇంటికి ఆధారంగా ఉన్న గేదెను అప్పటికప్పుడు అమ్మి తీసుకున్న రుణం మొత్తం చెల్లించింది.

అవమానంతో ఆత్మహత్యాయత్నం..

మండల కేంద్రం రుద్రవరానికి చెందిన ఓ మహిళ వ్యవసాయ పనుల కోసం ఓ ఫైనాన్స్ సంస్థ నుంచి రూ. 20 వేలు రుణం తీసుకుంది. మూడు వారాలు సక్రమంగా కంతులు చెల్లించినప్పటికీ నాలుగో వారం కంతు చెల్లించేందుకు డబ్బులు లేక సమావేశానికి వెళ్లలేదు. దీంతో ఆమె వచ్చే వరకు ఉండాలని సంస్థ ప్రతినిధి అందరినీ అక్కడే కూర్చోబెట్టారు. ఆగ్రహించిన మహిళలందరూ ఆమె ఇంటి మీదకు పోయి తీవ్రంగా దూషించడంతో మనస్తాపం చెందింది. దీంతో ఆమె ఇంట్లో ఉన్న పురుగు మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు సకాలంలో వైద్యశాలకు తరలించడంతో ప్రాణాలతో బయటపడింది. అయితే ఇంత జరిగినా వారం కంతులు మాత్రం క్రమం తప్పకుండా కట్టించుకోవడం గమనార్హం.

ఆళ్లగడ్డ: పేదరికాన్ని కొన్ని రుణ సంస్థలు సొమ్ము చేసుకుంటున్నాయి. ఓ వైపు లోన్ యాప్‌లు గాలం వేస్తుండగా మరో వైపు కొన్ని మైక్రో ఫైనాన్స్ సంస్థలు జిల్లాలో రాబందుల్లా వాలుతున్నాయి. పేదల అవసరాలకు అప్పు ఇవ్వడమే కాదు.. కంతులు కట్టకపోతే వేధింపులు 'వడ్డీ'స్తున్నాయి. అవమానాలకు గురి చేస్తున్నాయి. పేదలే లక్ష్యంగా చాపకింద నీరులా తమ వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించుకుంటున్నాయి. పేదలను అప్పుల ఊబిలోకి నెట్టి జీవితాలపై భారం మోపుతున్నాయి. ప్రభుత్వం వీటి నిర్వహణపై నిషేధం విధించినా రహస్యంగా రుణ పంపిణీ, వసూళ్లను సాగిస్తున్నాయి. పేద మహిళల నుంచి రోజు కంతు.. వారపు కంతు.. నెల కంతు అంటూ అధిక వడ్డీని వసూలు చేస్తున్నాయి. అధికారులు మాత్రం వీటిని పట్టించుకోక పోవడంతో మహిళలు ఆర్థికంగా నష్టపోతున్నారు. గ్రామీణ మహిళల అవసరాలను మైక్రో ఫైనాన్స్ సంస్థలు సొమ్ము చేసుకుంటున్నాయి. నిషేధానికి గురైన మైక్రో ఫైనాన్స్ సంస్థలు మళ్లీ జిల్లాలో వాటి కార్యకలాపాలను యథేచ్ఛగా కొనసాగిస్తున్నాయి. గతంలో మహిళల తిరుగుబాటుతో ప్రభుత్వం వీటి కార్యకలాపాలపై ఆంక్షలు విధించడంతో అదృశ్యమైన సంస్థలు ఇప్పుడిప్పుడే మళ్లీ రుణ పంపిణీ, వసూళ్లను సాగిస్తున్నాయి. జిల్లాలోని షేర్ సంస్థతో పాటు కడప, చిత్తూరు, తమిళనాడు, కర్ణాటక ప్రాంతాల నుంచి సైతం సుమారు 20 సంస్థలకు చెందిన ప్రతినిధులు మండల కేంద్రాలు, పట్టణ ప్రాంతాల్లో కార్యాలయాలు తెరిచి గుట్టుగా లావాదేవీలు కొనసాగిస్తున్నారు. గతంలో కేవలం సంఘాలుగా ఏర్పడ్డ వారికే రుణాలు ఇస్తుండగా ఇప్పుడు వ్యక్తిగతంగా కూడా రుణాలు అందజేస్తున్నారు. గ్రామాల్లో కొందరు బ్రోకర్లను ఏర్పాటు చేసుకుని వారి అవసరాలను ఆసరా చేసుకుని రుణాలు ఇస్తున్నారు. ఇచ్చిన రుణాలను రోజు కంతు అయితే ఒకరం, వారం కంతు అయితే మరో రకం, నెల కంతు అయితే ఇంకో రకంగా వడ్డీలు లెక్క వేస్తూ అసలు, వడ్డీ కలిపి 10 నుంచి 12 వారాల్లోనే సంస్థలు వసూలు చేస్తూ అధిక వడ్డీని గుంజుతున్నాయి.



రుణ కంతు చెల్లించమని మహిళ ఇంటిదగ్గరకు వచ్చి అడుగుతున్న ఏజెంట్లు

కంతు కట్టకపోతే కదలనీయరు..

మైక్రో ఫైనాన్స్ సంస్థ నిర్వాహకులు గ్రామీణ ప్రాంతాల్లోని శివారు కాలనీలు, దళిత, గిరిజన కాలనీలు, గూడేలు, తండాల్లోని మహిళల అవసరాలు, అవగాహన లోపాన్ని ఆసరా చేసుకుని సొమ్ము చేసుకుంటున్నాయి. ముందుగా ఆయా కాలనీల్లో ఒకరిని ఏజెంటుగా పెట్టుకుని వారి ద్వారా ఐదు నుంచి పది మంది సభ్యులను గ్రూపుగా ఏర్పాటు చేసి వారి అవసరాన్ని బట్టి గ్రూపుకు రూ. లక్ష నుంచి రూ. 5 లక్షల వరకు రుణం ఇస్తున్నారు. గ్రూపులో ఏ ఒక్కరూ కంతు కంట్టక పోయినా అందరూ అక్కడే కూర్చోవాలి. లేదా అందరూ కలిసి ఆమె కంతు చెల్లించి అక్కడి నుంచి పోవాలే తప్ప వాయిదా వేయడానికి వీలు లేదు.

జిల్లాలో రూ.100 కోట్లకు పైగా రుణాలు

జిల్లాలోని పలు మండలాల్లో మైక్రో ఫైనాన్స్ సంస్థలు ప్రతి నెల రూ.100 కోట్లకు పైన రుణాలను అందజేస్తున్నాయి. రాష్ట్రంలోని వివిధ సంస్థలతో పాటు తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్ ప్రాంతాల నుంచి పలు సంస్థల ప్రతినిధులు పట్టణ ప్రాంతాల్లో ఇళ్లను బాడుగకు తీసుకుని స్థానిక యువతను ఏజెంట్లుగా పెట్టుకుని తమ కార్యకలపాలను కొనసాగిస్తున్నారు.

అధిక వడ్డీ ఇలా..

ఫైనాన్స్ సంస్థలు తొలుత తక్కువ మొత్తాలకు మహిళలకు రుణంగా ఇస్తున్నాయి. సకాలంలో చెల్లించిన గ్రూపులకు రెట్టింపు మొత్తంలో రుణాలను అందజేస్తున్నాయి. గ్రూపు రుణాలతో పాటు వ్యక్తిగత రుణాలు, హౌసింగ్ తదితర రుణాలను అందజేస్తున్నారు. తీసుకున్న రుణాలను వారానికి ఒకసారి తిరిగి చెల్లించాల్సి ఉంది. ఉదాహరణకు ఒక వ్యక్తికి రూ. 10 వేలను రుణం కింద ఇచ్చి వారానికి రూ. 1,000 చొప్పున వసూలు చేస్తారు. ఇలా 12 వారాల పాటు బాధితులు చెల్లించాలి. ఈ లెక్కన రూ. 10 వేలు రుణం తీసుకున్న వారి నుంచి మూడు నెలల్లో రూ. 12 వేలు వసూలు చేస్తారు. ఇందులో వడ్డీ రూపంలో రూ. 2 వేలు తీసుకుంటారు. ఇదే రూ. 10 వేల మొత్తానికి రూ. 2 వడ్డీ లెక్కన లెక్కిస్తే మూడు నెలలకు రూ. 600 మాత్రమే. దీనితో పాటు వారానికోసారి వసూలు చేయడం వలన అసలు, వడ్డీ కలిపి ఉంటుంది. మొత్తం మీద ఈ లెక్కన ఈ సంస్థలు రూ. 5 పైనే వడ్డీని వసూలు చేస్తున్నాయని చెప్పవచ్చు.

విచారణ చేపడతాం



ప్రైవేటు మైక్రో ఫైనాన్స్ సంస్థలు రుణాలు ఇస్తూ వేధిస్తున్నారన్న విషయంపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఈ వ్యవహారంపై ఇంతవరకు ఫిర్యాదు అందలేదు. అధిక వడ్డీలతో పేదలను మోసం చేస్తే సహించేది లేదు.

– షర్ఫుద్దీన్, డీఎస్పీ, ఆళ్లగడ్డ

వాడుతున్న ఆశలు



అప్పనపల్లె వద్ద వాడుతున్న మొక్క జొన్న పైరు




డి.కొట్టాల సమీపంలో మొక్క జొన్నను దున్నేసిన దృశ్యం

రుద్రవరం: వరుణుడు దోబూచులాడటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ముందస్తు వర్షాలకు అరకొరగా పంటలు సాగు చేసిన అన్నదాతలు నష్టపోతున్నారు. గత 20 రోజులుగా మండలంలో వానలు లేకపోవడంతో మొక్కజొన్న, మినుము పంటలు వాడుముఖం పట్టాయి. కొందరు రైతులు పంటలను కాపాడుకునేందుకు వ్యయప్రయాసలు పడుతున్నారు. కొంత మంది రైతులు పంటలపై ఆశలు వదిలేసుకుని దున్నేస్తున్నారు. డి.కొట్టాల, శ్రీరంగాపురం, కోటకొండ, ఎర్రగుడిదిన్నె, పేరూరు, చిలుకలూరు, చందలూరు తదితర గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. సకాలంలో వానక కురవకపోవడంతో పెట్టుబడి నేలపాలైంది.

పీజీ రెండో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో పీజీ రెండో సెమిస్టర్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. ఆర్‌యూ కేంద్రంతో పాటు ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, నంద్యాల, నందికొట్కూరు, ఆళ్లగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. మొత్తం 555 మంది విద్యార్థులకు గాను 520 మంది విద్యార్థులు హాజరు కాగా 35 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ఎన్‌టీకే నాయక్ పరిశీలించారు.



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న వీసీ ఎన్‌టీకే నాయక్

నేడు మద్రాస్ కాల్వకు నీటి విడుదల

వెలుగోడు: వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లోకి కృష్ణా జలాలు విడుదలవుతుండటంతో శుక్రవారం మద్రాస్ కాల్వకు నీటిని విడుదల చేస్తున్నట్లు ఈఈ వెంకటేశ్వర్లు తెలిపారు. ఉదయం 9.30 గంటలకు వీబీఆర్ హెడ్ రెగ్యులేటర్ వద్ద గేట్లు ఎత్తి 1000 క్యూసెక్కులు విడుదల చేస్తారని తెలిపారు. గురువారం బానకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి 16,125 క్యూసెక్కుల నీరు వీబీఆర్‌కు వచ్చి చేరిందని, ప్రస్తుతం వీబీఆర్‌లో 6 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఏఈ శివనాయక్ తెలిపారు.

పూడికతీత మాటున దోపిడీ యత్నం!

- యూఎల్బీలలో పూడిక తొలగింపునకు నిధులు మంజూరు
- నంద్యాల మున్సిపాలిటీకి అత్యధికంగా రూ.1.49 కోట్లు
- సంక్షేమాభివృద్ధి లేకున్నా నిధుల గోల్‌మాల్‌కు తెర

నంద్యాల(సిటీ): గతంలో డీసిల్టేషన్ పనులను స్థానిక అర్బన్‌లో ఉండే మున్సిపాలిటీలు, నగర పంచాయితీలు, మున్సిపల్ కార్పొరేషన్లు నిర్వహించేవి. స్థానిక సంస్థల ద్వారా ఏర్పడిన మున్సిపాలిటీ వారు వారి అవసరాలకు అనుగుణంగా పూడిక తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునే వారు. నేడు అందుకు భిన్నంగా పనులు పూర్తి కాకముందే కోట్లాది రూపాయలు యూఎల్బీ (అర్బన్ లెవల్ బాడీ)ల ఖాతాలకు మళ్లించి సొమ్ము చేసుకునేందుకు టీడీపీ ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. అన్ని మున్సిపాలిటీలలో పారిశుద్ధ్య పనుల కోసం కొంత సొమ్మును ఆయా మున్సిపాలిటీలలోని బడ్జెట్‌లో కేటాయింపులు చేసి అందుకు అనుగుణంగా పనులు చేయిస్తారు. కానీ ఇందుకు విరుద్ధంగా నేరుగా రాష్ట్ర ప్రభుత్వం రూ.50 కోట్లను నేరుగా 106 యూఎల్బీలకు మళ్లించి పనులు చేయించాలనుకోవడం ఒకింత ఆశ్చర్యం కలుగుతోంది. ఇలా కోట్లాది రూపాయలను తమ అనుయాయులకు అందించేందుకు పథకం ప్రకారమే ఇలా చేస్తుందన్న విమర్శలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. నంద్యాల మున్సిపాలిటీకి అత్యధికంగా రూ.1.49 కోట్ల నిధులు మంజూరయ్యాయి. అలాగే డోన్‌కు రూ. 44.25 లక్షలు, ఆత్మకూరు రూ. 34.12 లక్షలు, ఆళ్లగడ్డ 31.66లక్షలు , నందికొట్కూరు 35.06 లక్షలు, బేతంచెర్లకు రూ. 29.84 లక్షలు మంజూరయ్యాయి.

ఎక్కడో అనుమానం..

రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల కంటే నంద్యాల మున్సిపాలిటీకి నిధులు పెద్ద ఎత్తున రావడం హర్షణీయమే అయినా గతంలో జరిగిన సంఘటనలు చూస్తే కొంత అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత వైఎస్సార్‌సీపీ హయాంలో పారిశుద్ధ్య కార్మికులతో తక్కువ ఖర్చుతో డీసిల్టేషన్ పనులు చేయించి నాడు పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. ఒకానొక సందర్భంలో డీసిల్టేషన్ బిల్లులు రూ.39 లక్షలు కౌన్సిల్ ముందు పెడితే అది రద్దు చేసిన విషయం విధితమే. పెరుగుతున్న జనాభా ఆధారంగా పట్టణంలో రోజువారీ పారిశుద్ధ్య పనులు చేయడానికి 2023 ఫిబ్రవరిలో సిబ్బందికి అదనంగా 60 మంది పారిశుద్ధ్య కార్మికులను తాత్కాలిక పద్ధతిన దినసరి కూలీ రూ.400తో తీసుకున్నారు. పారిశుద్ధ్య పనుల అనంతరం వారితోనే డీసిల్టేషన్ పనులు చేయించి మున్సిపాలిటీకి భారంగా మారిన డిసిల్టేషన్ వ్యయం నుంచి తప్పించింది. అంతే కాకుండా ఇందుకు వెచ్చించాల్సిన సొమ్ము నుంచి పారిశుద్ధ్య నిర్వహణకు అవసరమయ్యే రెండు ట్రాక్టర్లను కొనుగోలు చేయాలని యోచించి వాటి కొనుగోలుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. కానీ ఇంత వరకు ట్రాక్టర్లు ఏమయ్యాయో తెలియదు. నంద్యాల మున్సిపాల్టీలో పూడిక తీతకు మంజూరైన నిధులతో కొత్త కాల్వలు నిర్మించవచ్చనే విమర్శలు ఉన్నాయి.



నంద్యాల పట్టణంలో మురికి కాల్వలో పూడిక తీస్తున్న దృశ్యం (ఫైల్)

వీధికెక్కి.. గడువు తగ్గి!

- అస్తవ్యస్తంగా పింఛన్ల పంపిణీ
- అందరినీ ఒకే చోటకు పిలిపించిన టీడీపీ నాయకులు
- రచ్చబండల దగ్గర, చెట్ల కింద పంపిణీ
- సచివాలయాల వద్ద వృద్ధులకు తప్పని తిప్పలు



పింఛన్ కోసం ఆళ్లగడ్డ మున్సిపాలిటీ కార్యాలయానికి వచ్చిన లబ్ధిరాలు చాకలి పుల్లమ్మ

కర్నూలు(అగ్రికల్చర్): ఇంటి దగ్గరే పింఛన్ల పంపిణీ మాటలకే పరిమితం అవుతోంది. ఆగస్టు నెలలో నియోజకవర్గాల వారీగా స్పెషల్ ఆఫీసర్లకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. జూలై నెల తరహాలోనే పింఛన్ల పంపిణీ అస్తవ్యస్తమైంది. అన్ని చోట్లా లబ్ధిదారుల అవస్థలే దర్శనమిచ్చాయి. లబ్ధిదారుల ఇళ్లు తెలియకపోవడంతో జూలై నెలలో సచివాలయ ఉద్యోగులు ఒక చోటుకు పిలిచి పంపిణీ చేశారు. ఆగస్టు నెలలోనైనా ఇంటి దగ్గరకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తారని భావించారు. అయితే ఉదయం గంట, రెండు గంటల పాటు ఇళ్ల దగ్గరకి వెళ్లి పంపిణీ చేశారు. అనంతరం లబ్ధిదారులందరినీ ఒకేచోటకు పిలిపించి పింఛన్లు ఇచ్చారు. పింఛన్ల పంపిణీ ఒక్క రోజు మాత్రమే ప్రభుత్వం ప్రకటించడంతో భయపడిపోయిన లబ్ధిదారులు సచివాలయ ఉద్యోగులను వెతుక్కుంటూ వెళ్లాల్సి వచ్చింది.

తప్పని తిప్పలు..

వైఎస్సార్‌సీపీ హయాంలో వలంటీర్ వ్యవస్థ ఉండేది. లబ్ధిదారులకు ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ ఇచ్చేవారు. అవ్వాతాతలు, దివ్యాంగులు, వ్యాధిగ్రస్తులు సంతోషం వ్యక్తం చేసేవారు. పింఛన్ల పంపిణీ వారం రోజుల పాటు కొనసాగేది. దూర ప్రాంతాల్లో ఉండే వారికి, ఆసుపత్రుల్లో చికిత్స పొందేవారికి వలంటీర్లు పింఛన్ ఇచ్చేవారు. ప్రస్తుతం ఈ పరిస్థితులు లేవు. ఈ ఏడాది ఏప్రిల్‌లో సచివాలయాల్లో పింఛన్లు పంపిణీ చేశారు. మే, జూన్ నెలల్లో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు పింఛన్ జమ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత కూడా పింఛన్ల పంపిణీ సాఫీగా జరగడం లేదు. రచ్చబండల దగ్గర, చెట్లకింద, వీధుల్లో పంపిణీ చేస్తున్నారు. దీంతో అవ్వాతాతలకు, దివ్యాంగులకు తిప్పలు తప్పడం లేదు. పింఛన్ల పంపిణీలో సచివాలయ ఉద్యోగులందరినీ భాగస్వాములను చేశారు. కర్నూలు జిల్లాలో 4879 మంది, నంద్యాల జిల్లాలో 4394 మంది పాల్గొన్నారు. కర్నూలు జిల్లాలో 2,43,337 పింఛన్లు ఉండగా 2,38,540, నంద్యాల జిల్లాలో 2,19,863 పింఛన్లు ఉండగా 2,14,167 పంపిణీ చేశారు. సాంకేతిక కారణాలతో మిగిలిపోయిన వారికి 2వ తేదీ పంపిణీ చేస్తారు. పింఛన్లు పంపిణీ చేసే గడువు ఒక్క రోజుకే పరిమితం కావడంతో చాలా మంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పింఛన్ తీసుకునేందుకు సుదూర ప్రాంతాల నుంచి హడావుడికి స్వగ్రామాలకు వచ్చారు.

చెట్ల కింద పంపిణీ




కొలిమిగుండ్ల ఎస్సీ కాలనీలో చెట్టు కింద పింఛన్ల పంపిణీ చేస్తున్న దృశ్యం

ఎన్టీఆర్ సామాజిక పింఛన్ల లబ్ధిదారులకు ఇంటి వద్దకే అందిస్తామని ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. రచ్చబండ, చెట్లు, సచివాలయాల వద్దనే అందరిని ఒక చోట చేర్చి పింఛన్ సొమ్ము అందిస్తున్నారు. గురువారం ఆగస్టు నెల పింఛన్ల పంపిణీ మండలంలోనే ఇలాగే కొనసాగింది. గతంలో వలంటీర్లు తెల్లవారు జామునే ఇంటి వద్దకు వచ్చి ఇచ్చే పద్ధతి బాగుందని లబ్ధిదారులు గుర్తు చేసుకున్నారు. పింఛన్‌ల పంపిణీకి రెండు రోజుల మాత్రమే గడువు ఇవ్వడంతో లబ్ధిదారులు ఎక్కడున్నా స్వగ్రామాలకు చేరుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. జూలై నెలకు సంబంధించి మండలంలో ఏడుగురికి పింఛన్ సొమ్ము అందలేదు.

– కొలిమిగుండ్ల

పింఛన్ పంపిణీ గడువు పెంచాలి



పేదలకు ప్రభుత్వం పంపిణీ చేసే పింఛన్ సొమ్ము ఎంతో ఆధారం. గతంలో ఐదు రోజుల పాటు పింఛన్ పంపిణీ కొనసాగేది. ప్రస్తుతం రెండు రోజులకే పరిమితం చేయడం సరికాదు. అత్యవసరం, అనారోగ్య కారణాలతో దూర ప్రాంతాలకు వెళ్లినప్పుడు పింఛన్ తీసుకోలేని పరిస్థితి ఏర్పడుతుంది. పింఛన్ల పంపిణీ గడువు పెంచడంతో లబ్ధిదారులందరికీ ఇంటింటికీ అందజేయాలి. – పుల్లయ్య, బి.తాడిపత్రి చెంచుగూడెం, కొలిమిగుండ్ల మండలం

మల్లన్న సేవలో జిల్లా ఎస్పీ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. గురువారం రాత్రి మల్లన్న దర్శనార్థం ఆలయం వద్దకు విచ్చేసిన ఆయనకు ఆలయ రాజగోపురం వద్ద దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఎస్పీ మల్లికార్జున స్వామివారికి రుద్రాభిషేకం, భ్రమరాంబాదేవిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆలయం వద్దగల ఆశీర్వచన మండపంలో వేదపండితులు వేదమంత్రాలు పలుకగా, అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. ఈఓ స్వామివారి శేషవస్త్రాలను, లడ్డూప్రసాదాలను, జ్ఞాపికను అందించి సత్కరించారు.



ఎస్పీ అధిరాజ్‌సింగ్‌కు జ్ఞాపికను అందజేస్తున్న ఈఓ

క్లుప్తంగా

'ఉస్మానియా'లో ఉచిత టెట్ శిక్షణ

కర్నూలు కల్చరల్: సెంటర్‌ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనార్టీస్ (సీఈడీఎమ్) ఆధ్వర్యంలో ఉస్మానియా కళాశాలలో గురువారం ఉచిత టెట్, ఎస్‌జీటీ ఉర్దూ మాధ్యమం శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆర్‌సీఈడీఎమ్ కర్నూలు డిప్యూటీ డైరెక్టర్ సయ్యద్ సమీవుద్దీన్ ముజమిల్ మాట్లాడుతూ.. 45 రోజుల పాటు నిర్వహించే శిక్షణను సద్వినియోగం చేసుకుని, త్వరలో నిర్వహించే టెట్‌లో అర్హత సాధించాలన్నారు. డీఎస్సీ రాసి ఉపాధ్యాయులుగా నియామకం కావాలని ఆకాంక్షించారు.

చోరీ కేసు నమోదు

ఆదోని అర్బన్: ఆర్టీసీ కాలనీలోని ప్రభుత్వ ఉపాధ్యాయుడు వీరచంద్రయాదవ్ ఇంట్లో బుధవారం చోరీ జరగగా.. గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. క్లూస్ టీం వేలి ముద్రలను సేకరించింది. మొత్తం మూడు తులాల బంగారం, రూ.35 వేలు నగదు చోరీ జరిగినట్లు ఉపాధ్యాయుడు వీరచంద్రయాదవ్ తెలిపారు. ఒకటిన్నర కేజీ వెండి మాత్రం చోరీకి గురికాలేదని సురక్షితంగానే ఉందన్నారు. అయితే సీసీ కెమెరాల్లో 31వ తేదీన బుధవారం తెల్లవారుజామున 1 గంట సమయంలో చోరీ జరిగినట్లు పాల్పడినట్లు సీసీ ఫుటేజీలో రికార్డు అయ్యింది.

జూనియర్ అసిస్టెంట్ ఆత్మహత్యాయత్నం

కొలిమిగుండ్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించే వెంకటేశ్వరరెడ్డి గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పదిహేను రోజులుగా సెలవులో ఉన్న ఈయన అతని స్వగ్రామం కోవెలకుంట్ల మండలం పెద్దకొప్పెర్లలో గురువారం గడ్డి మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షలు చేయడంతో కోలుకున్నాడు. కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స కోసం నంద్యాలకు తీసుకుకెళ్లారు. కారణాలు తెలియాల్సి ఉంది.

విజయీభవ!

నంద్యాల(న్యూటౌన్): నెల్లూరులో ఈనెల 2, 3, 4 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ఉమ్మడి కర్నూలు జిల్లా నంద్యాల కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో పురుషులు, మహిళల బీచ్ కబడ్డీ జట్లు గురువారం బయలుదేరాయి. ఈ సందర్భంగా ఉమ్మడి కర్నూలు జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ ఏపీరెడ్డి, వైస్‌ప్రెసిడెంట్ నాగరాజు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు.

పెన్షన్ స్కీం సర్టిఫికెట్ల జారీకి ప్రత్యేక మెడికల్ బోర్డు

కర్నూలు(హాస్పిటల్): ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ స్కీం అమలుకు మెడికల్ బోర్డు ఏర్పాటు చేసినట్లు కర్నూలు ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వీల్ చైర్, బెడ్‌కు మాత్రమే పరిమితమైన రోగులకు, ప్రమాదాలు జరిగిన రోగులు, మస్కులర్ డిస్ట్రఫీ ఉన్న రోగులకు పింఛన్‌ను రూ.5 వేల నుంచి రూ.15 వేలకు పెంచేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అలాగే రెండు కాళ్లకు బోధకాలు వ్యాపించిన వారికి, ప్రత్యేక పరిస్థితుల్లో కిడ్నీ డయాలసిస్ చేసుకునే రోగులకు నిబంధనలు అనుసరించి కిడ్నీ, కాలేయం, గుండె మార్పిడి చేసుకున్న రోగులకు రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు పెంచారన్నారు. సంబంధిత రోగులు జిల్లా కలెక్టర్‌ను స్పందనలో కలసినప్పుడు వారికి సర్టిఫికెట్లు ఇవ్వాల్సిందిగా ఆదేశించారన్నారు. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ నుంచి నిబంధనలు వచ్చాయన్నారు. ప్రతి బుధవారం ధన్వంతరి హాల్‌లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సర్టిఫికెట్లు ఇస్తామన్నారు. సర్టిఫికెట్లు అవసరమైన వారు ఫోన్ నెంబర్ నమోదు చేసుకుంటే సీనియారిటీ ప్రకారం పిలుస్తామన్నారు.

'మరక' మంచిదే!

ఏసీబీ కేసులున్న సీఐలకూ కీలక పోస్టింగ్‌లు

- అవినీతి ఆరోపణలున్న అధికారులకు అందలం
- సీఐల బదిలీల్లో రచ్చకెక్కిన కిరికిరి వ్యవహారం
- వివాదాస్పదమైన నందికొట్కూరు రూరల్ సర్కిల్ పోస్టింగ్
- పోస్టింగ్ వేసిన అరగంటకే రద్దు చేయించిన ఎంపీ



కర్నూలు: సీఐల బదిలీల జాబితా బయటకు వచ్చి 24 గంటలు కూడా గడవకముందే వ్యవహారం రచ్చకెక్కింది. ఏసీబీ కేసులు, అవినీతి, విధుల పట్ల అలసత్వం వంటి ఆరోపణలు ఉన్న ఇన్‌స్పెక్టర్లకు బదిలీల్లో కీలక స్థానాలు దక్కడం ఇటు పోలీసు, అటు తెలుగుదేశం వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. నంద్యాలలో లూప్‌లైన్ విభాగంలో పనిచేస్తున్న ఓ ఇన్‌స్పెక్టర్‌పై ఏసీబీ కేసు ఉన్నప్పటికీ నల్లమల అటవీ ప్రాంతంలోని కీలకమైన ఓ స్టేషన్ పోస్టింగ్ దక్కింది. పోలీసు, టీడీపీ వర్గాల్లో ఆ పోస్టింగ్‌పై పెద్ద చర్చ జరుగుతోంది. అదెలా సాధ్యమైందని ఎవరికి వారు ఆరా తీయగా స్థానిక ఎమ్మెల్యేను కాదని ఎంపీ చక్రం తిప్పి ప్రాధాన్య పోస్టింగ్ ఇప్పించడంతో ఆ ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. సురేష్ కుమార్ రెడ్డిని ఆ సీటులో నియమించాలని ఎమ్మెల్యే లేఖ ఇచ్చారు. అయితే అక్కడ ఏసీబీ కేసులో ఉన్న మరో అధికారిని నియమించడం పట్ల ఎమ్మెల్యే అభ్యంతరం వ్యక్తం చేసినట్లు చర్చ జరుగుతోంది. వాస్తవంగా ఏసీబీ కేసులో ఉన్నవాళ్లను నాన్ ఫోకల్ పోస్టులో నియమించాలనేది నిబంధన. అయితే ఆ అధికారిపై ఉన్న మరకను దాచేసి ఎంపీ కలుగజేసుకుని ఉన్నతాధికారిపై ఒత్తిడి చేసి పోస్టింగ్ ఇప్పించినట్లు చర్చ జరుగుతోంది.

- నంద్యాల పట్టణంలోని కీలకమైన స్థానానికి కూడా ఏసీబీ కేసులో ఉన్న ఇన్‌స్పెక్టర్‌కు ప్రజాప్రతినిధి లేఖ ఇచ్చారు. కర్నూలులో విధులు నిర్వహించేటప్పుడు ఆ ఇన్‌స్పెక్టర్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. విషయాన్ని దాచిపెట్టి కీలకమైన స్థానంలో నియమించుకునేందుకు ఓ ప్రజాప్రతినిధి లేఖ ఇచ్చారు. ఆయన నియామకం దాదాపు ఖరారైనట్లు చర్చ జరుగుతోంది.
- కర్నూలులో అత్యంత కీలకమైన ఫోర్త్ టౌన్ ఎస్‌హెచ్‌ఓ పోస్టింగ్‌పై ఇప్పటికే దుమారం రేగింది. ఇక్కడికి వచ్చేందుకు పలువురు అధికారులు పోటీ పడుతున్నారు. అయితే శ్యాండ్ అధికారిగా పేరుపొందిన ఓ ఇన్‌స్పెక్టర్ ఆ సీటు దక్కించుకునేందుకు ఓ ప్రజాప్రతినిధికి భారీగా ముడుపులు ముట్టజెప్పినట్లు పోలీసు వర్గాల్లో చర్చ జరుగుతోంది.
- అలాగే పశ్చిమ ప్రాంతంలోని జిల్లా సరిహద్దు సర్కిల్‌కు అవినీతి ఆరోపణలు ఉన్న మరో అధికారిని నియమించడం కూడా వివాదాస్పదంగా మారింది. స్థానిక టీడీపీ నేతలు ఆ అధికారి నియామకాన్ని వ్యతిరేకిస్తున్నట్లు సమాచారం.

వివాదాల సుడిగుండం

- నందికొట్కూరు రూరల్ సర్కిల్ పోస్టింగ్ కూడా తెలుగు తమ్ముళ్ల మధ్య వివాదానికి దారి తీసింది. ఎమ్మెల్యే ఇచ్చిన లేఖ ఆధారంగా అక్కడ సుధాకర్‌రెడ్డిని నియమించగా అరగంట వ్యవధిలోనే ఎంపీ కలుగజేసుకుని ఆ పోస్టింగ్ రద్దు చేయించి తనకు అనుకూలమైన బీఆర్ కృష్ణయ్యను నియమించుకున్నట్లు చర్చ జరుగుతోంది.
- కొత్తగా ఏర్పాటైన ఎమ్మిగనూరు పోలీస్ సబ్ డివిజన్‌లో ప్రధాన సర్కిల్ స్థానానికి ఓ అధికారి వద్దనుంచి ఓ ప్రజాప్రతినిధి రూ.10 లక్షలు దండుకున్నట్లు పోలీసు అధికారులకు ఫిర్యాదు అందింది. దీంతో ప్రజాప్రతినిధి ఇచ్చిన లేఖను పక్కనపెట్టి అక్కడ మరో అధికారికి పోస్టింగ్ కేటాయించారు. ఆ నియోజకవర్గంలోని తెలుగు తమ్ముళ్లలో ఈ అంశం చర్చనీయాంశమైంది.
- నంద్యాల తాలూకా యూపీఎస్‌కు రాజారెడ్డిని నియమించాలని ప్రజాప్రతినిధి లేఖ ఇచ్చినట్లు సమాచారం.
- నంద్యాల జిల్లాలో కడపకు సరిహద్దు నియోజకవర్గం, కర్నూలు జిల్లాకు సరిహద్దు నియోజకవర్గానికి సంబంధించిన ప్రజాప్రతినిధుల బంధువులు పోలీసు అధికారుల పోస్టింగుల కోసం భారీగా ముడుపులు వసూలు చేసినట్లు చర్చ జరుగుతోంది.
- కర్నూలులో పనిచేస్తున్న ఓ ఇన్‌స్పెక్టర్ పక్క సర్కిల్ సీటుపై అందరికంటే ముందే కర్చీఫ్ వేశారు. అనూహ్యంగా మరొకరు రావడంతో ఆశ పెట్టుకున్న సదరు అధికారి కంగుతిన్నాడనే చర్చ జరుగుతోంది.
- కర్నూలు రూరల్ తాలూకా స్టేషన్‌కు చంద్రబాబు నాయుడు, పాణ్యం పీఎస్‌కు కిరణ్‌కుమార్ రెడ్డి, గడివేముల పీఎస్‌కు ప్రస్తుతం అవుకులో ఉన్న కిరణ్, ఓర్వకల్లు పీఎస్‌కు సునిల్, ఉలిందకొండ పీఎస్‌కు ఇంటెలిజెన్స్ విభాగంలో పనిచేస్తున్న ఎస్ఐ ధనుంజయకు స్థానిక ప్రజాప్రతినిధులు లేఖలు ఇచ్చినట్లు సమాచారం.

జోరందుకున్న పైరవీలు

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక పోలీసు శాఖలో కొందరు డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు ప్రజాప్రతినిధుల సిఫారసులతో ఉమ్మడి జిల్లాలో పోస్టింగులు పొందారు. ఎన్నికల్లో గెలుపొందిన పార్టీకి దగ్గరగా పని చేసిన ఓ అధికారి నంద్యాల జిల్లా ప్రజాప్రతినిధి అండతో సబ్ డివిజన్‌లో కూర్చున్నారు. మొదటి విడత బదిలీల్లో జిల్లాలో 22 మందికి స్థానాలు దక్కాయి. రెండో విడత బదిలీలపై పైరవీలు జోరందుకున్నాయి. ఖాళీగా ఉన్న డీఎస్పీలతో పాటు సీఐ, ఎస్ఐ పోస్టింగుల కోసం పెద్ద ఎత్తున లాబీయింగ్ సాగిస్తున్నట్లు సమాచారం. ఎన్నికలకు ఏడాది ముందు వచ్చిన అధికారులు ఇంకా కొనసాగుతున్నారు. వారిలో కొందరిపై వైఎస్సార్‌సీపీ అనుకూల ముద్ర వేసి ఆ స్థానాల్లో పోస్టింగులు దక్కించుకునేందుకు అధికార పార్టీ సామాజిక వర్గ అధికారులు ప్రయత్నాలు సాగిస్తూ తమకు అనుకూలమైన కూటమి నేతల ద్వారా ఉన్నతాధికారులపై ఒత్తిళ్లు తెస్తున్నారు. ప్రజాప్రతినిధుల ఇళ్లకు వెళ్లి కోరుకున్న చోట తమకు అవకాశం కల్పిస్తే చెప్పినట్లు నడుచుకుంటామని స్పష్టం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు కూడా తమ పట్ల విధేయులై అంకితభావంతో పనిచేసేవారికే అవకాశం ఇస్తున్నారనే చర్చ జరుగుతోంది.

వైద్యులు నిరంతరం నేర్చుకుంటూనే ఉండాలి

కర్నూలు(హాస్పిటల్): ప్రతి వైద్యుడూ నిరంతర విద్యార్థిగా ఉండి రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి సూచించారు. కర్నూలు మెడికల్ కాలేజీలోని మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్‌లో ఎన్‌ఎంసీ గైడ్‌లైన్స్ మేరకు ఎంఈయూ కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ డాక్టర్ సింధియా శుభప్రద ఆధ్వర్యంలో మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్య నేర్పే గురువులు తమ టీచింగ్ మెలకువలను నిరంతరం మెరుగు పరచుకుంటూ ఉన్నప్పుడే మంచి గురువులుగా మారతారన్నారు. వైద్య విద్యార్థులకు మంచి మెలకువలతో విద్య నేర్పితే అలాంటి గురువులను జీవితాంతం గుర్తుంచుకుంటారని చెప్పారు. శిక్షణకు అబ్జర్వర్‌గా భాస్కర మెడికల్ కాలేజీ నుంచి డాక్టర్ కవిత హాజరయ్యారు. వైస్ ప్రిన్సిపాల్ రేణుకాదేవి, డాక్టర్ హరిచరణ్, ఎంఈయూ సభ్యులు విజయానంద బాబు, లక్ష్మి, విశాల, అరుణ, కుముద, భాను ప్రకాష్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



వైద్య విద్యార్థులతో ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టినరసమ్మ, సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి

ప్రమాదపు అంచున విద్యార్థులు పాఠశాలలకు వెళ్తున్నారు. సమయానికి బస్సు సౌకర్యం లేక సకాలంలో బడికి వెళ్లేందుకు గ్రామీణ విద్యార్థులు ట్రాక్టర్లు, ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోంది. గురువారం మండలంలోని గుండుపాపల గ్రామంలోని కొంత మంది విద్యార్థులు కోవెలకుంట్ల మండలం రేవనూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు ఇలా ట్రాక్టరు వెనకాల ఉన్న గొర్రుపై ఎక్కి ప్రమాదకర పరిస్థితుల్లో వెళ్లారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రయాణం విషయంలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. – దొర్నిపాడు

ఓ విద్యార్థీ వద్దు!



ట్రాక్టరు గొర్రుపై ఎక్కి బడికి వెళ్తున్న విద్యార్థులు

విద్యార్థులపైకి దూసుకెళ్లిన బైక్‌లు

- ఐదుగురికి గాయాలు

ఆళ్లగడ్డ: మండలంలోని ఆర్ క్రిష్ణాపురం మెట్ట సమీపంలో రెండు బైకులు విద్యార్థులపై దూసుకెళ్లిన ప్రమాదంలో ఐదుగురికి గాయాలయ్యాయి. మర్రిపల్లె గ్రామానికి చెందిన సుమారు 10 మంది విద్యార్థులు గురువారం ఆర్.క్రిష్ణాపురంలో బస్సు దిగి జెడ్పీ హైస్కూల్‌కు బయలు దేరారు. ఇంతలో చాగలమర్రి నుంచి ఒక బైకు, ఆళ్లగడ్డ నుంచి మరో బైకుపై వస్తున్న వ్యక్తులు అదుపు తప్పి విద్యార్థులపైకి దూసుకెళ్లారు. దీంతో గంగోత్రి, వసుంధరకు తీవ్ర గాయాలయ్యాయి. ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలలో ప్రాథమిక చికిత్స నిర్వహించి మెరుగైన చికిత్స కోసం నంద్యాల వైద్యశాలకు తరలించారు. స్వల్పంగా గాయపడిన మంజుల, వెంకటేశ్వరి, తరుణిలను 108లో ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్సలు అందించారు. ఈ మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ నరసింహులు తెలిపారు.



చికిత్స పొందుతున్న గంగోత్రి, వసుంధర

భారీగా కర్ణాటక మద్యం పట్టివేత

- ఒక కారు, ఆటో స్వాధీనం.. ఆరుగురు అరెస్ట్

ఎమ్మిగనూరురూరల్: సెబ్ సర్కిల్ పరిధిలో భారీగా కర్ణాటక మద్యాన్ని పట్టుకున్నట్లు సెబ్ సీఐ భార్గవరెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం స్థానిక సెబ్ కార్యాలయం ఆవరణలో పట్టుబడిన మద్యాన్ని చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రాలయం మండలం మాధవరం చెక్ పోస్ట్ దగ్గర వాహనాలు తనిఖీలు నిర్వహిస్తుండగా ఆటోలో 18 బాక్సుల కర్ణాటక మద్యం కనిపించిందన్నారు. ఆదోని పట్టణం నిజాముద్దీన్ కాలనీ చెందిన షేక్‌మహమ్మద్, మార్థివాడికి చెందిన పింజరి మౌలను పట్టుకోగా ఆదోనికి చెందిన బండి అలీ, బండి ఫయాజ్‌లు పరార్ అయినట్లు చెప్పారు. ఆటోను, అందులోని కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని, పట్టుబడిని మద్యం విలువ రూ. 1.50 లక్షలు ఉంటుందని తెలిపారు. ఇద్దరు నిందితులను కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించారన్నారు.



పట్టుబడిన మద్యాన్ని చూపిస్తున్న సెబ్ పోలీసులు

కారులో 37 బాక్సుల మద్యం ..

మంత్రాలయం మండలం చెట్నీపల్లి గ్రామ సమీపంలో కల్లుదేవకుంట రోడ్డు క్రాస్ దగ్గర కారును తనిఖీ చేయగా 37 బాక్సుల కర్నాటక మద్యం కనిపించిందన్నారు. రచ్చుమర్రి గ్రామానికి చెందిన మజ్జి రామకృష్ణ, పోలి వీరేష్, ఆదోని శివశంకర్‌లతో పాటు రాయచూర్ జిల్లా గుండ్రేవుల గ్రామానికి చెందిన శివరాజలను అరెస్ట్ చేశామన్నారు. పట్టుబడిన మద్యం విలువ రూ. 3 లక్షలు ఉంటుందన్నారు. నలుగురిని కోర్టులో హాజరుపర్చగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించినట్లు తెలిపారు. తనిఖీల్లో సెబ్ ఎస్ఐ సత్యనారాయణ, హెడ్‌కానిస్టేబుళ్లు లింగప్రసాద్, గోపాల్, కానిస్టేబుళ్లు భరత్, నరసింహారెడ్డి, లక్ష్మన్న పాల్గొన్నారు.

'ఉచిత ఇసుక'లో అక్రమాల మేట!

- భారీగా దొరుతుకున్న డంప్‌లు
- జరిమానాలతో సరి.. కేసుల ఊసే లేదు
- జరిమానా డబ్బులన్నీ వ్యక్తిగత ఖాతాల్లోకి?
- ఎక్కడా అమలుకాని ప్రభుత్వ నిబంధనలు
- సామాన్యులకు ఇసుక దొరకని దుస్థితి

కర్నూలు (టౌన్): పేరుకే ఉచిత ఇసుక.. ప్రజలకు మాత్రం ఎక్కడా దొరకడం లేదు. ఒక వైపు టీడీపీ నేతలు భారీగా డంప్ చేసి సొమ్ము చేసుకుంటుండగా.. మరో వైపు కొందరు అధికారులు అక్రమ సంపాదనకు తెర తీశారు. నిబంధనలను అతిక్రమించి ఇసుక బ్లాక్ మార్కెటింగ్ చేసినా, అనధికారికంగా నిల్వ చేసినా రూ. 2 లక్షలు జరిమానా, రెండు సంవత్సరాల వరకు జైలుశిక్ష విధించాల్సి ఉన్నా.. ఎక్కడా ఆచరణలో కనిపించడం లేదు. భారీగా ఇసుక డంప్‌లు దొరుకుతున్నా.. కేసులు నామమాత్రంగా నమోదు చేస్తున్నారు. జరిమానా డబ్బులు సైతం వ్యక్తిగత ఖాతాలకు జమ చేయించుకుంటున్నారు.

అక్రమాలు ఇలా..

కర్నూలు మండలం మునగాలపాడు గ్రామం తుంగభద్రకు ఆనుకొని ఉంది. ఇక్కడ 50 రోజులుగా ఇసుక దందా కొనసాగుతోంది. అక్రమార్కులకు కర్నూలు మండలంలోని ఒక బలమైన టీడీపీ నాయకుడి అండదండలు ఉన్నాయి. దీంతో నిబంధనలకు విరుద్ధంగా పెద్ద ఎత్తున ఇసుకను నిల్వ చేస్తున్నారు. సామాన్యులకు ట్రాక్టర్ ఇసుకను రూ.8 వేల వరకు అమ్ముకుంటున్నారు. 18 టన్నుల లోడ్ ఉన్న ఇసుక రూ.50 వేలు, డ్రైవర్ బత్తా రూ. 1000, మందు ఖర్చుకు అదనంగా రూ.500 వసూలు చేస్తున్నారు. ఈనెల 19, 21వ తేదీల్లో మునగాలపాడు గ్రామంలో పెద్ద ఎత్తున ఇసుక నిల్వలు ఉన్నట్లు సమాచారం రావడంతో సెబ్ పోలీసులు, మైనింగ్ అధికారులు, రెవెన్యూ అధికారులు, పోలీసులు ఒకేసారి దాడులు చేసి, సీజ్ చేసినట్లు ప్రకటించారు. అయితే ఏ ఒక్కరిపై కేసులు నమోదు చేయలేదు. పైగా గ్రామంలోని ఇసుక ట్రాక్టర్ల వద్ద వరుసగా డబ్బులు వసూలు చేశారు. సెబ్ డీఎస్పీ డ్రైవర్ వాట్సాప్‌కు రూ.1400, అదే నెంబర్‌కు రూ.100, అదే రోజు రూ. 20 వేలు, సెబ్ పోలీసు సార్ అన్న వాట్సాప్‌కు రూ. 3 వేలు.. ఇలా పలుమార్లు రూ.2 లక్షల వరకు జరిమానాలు వసూలు చేశారు. మొత్తం అక్కడ 330 టన్నుల ఇసుక దొరికితే.. విచారణ చేపట్టి కేసులు నమోదు చేయలేదు. చివరికి నాలుగు రోజుల తరువాత ఇసుకను ప్రభుత్వ శాఖలకు రూ.335 ప్రకారం విక్రయించారు.



ఈ. తాండ్రపాడు వద్ద సీజ్ చేసిన ఇసుక

జరిమానాలు సరే.. స్లిప్పులు ఏవీ?

పెద్ద మొత్తంలో అక్రమ ఇసుక నిల్వ పేరుతో 12 మంది ఇసుక ట్రాక్టర్ల యజమానుల వద్ద రూ. 2 లక్షలకు పైగా జరిమానా వసూలు చేసిన సెబ్, మైనింగ్ అధికారులు ఏ ఒక్కరికీ అందుకు సంబంధించిన స్లిప్పులు ఇవ్వలేదు. జరిమానా డబ్బులు సొంత ఖాతాల్లోకి మార్చుకున్న ఘటనపై సంబంధిత ఉన్నతాధికారులు విచారణ చేయాలని పలువురు కోరుతున్నారు.

సీజ్ చేసిన ఇసుక డంప్‌లు ఇవీ..

- జూన్ 20న కౌతాళం మండలం గుడికంబాళి స్టాక్ పాయింట్ సమీపంలోనే పెద్ద ఎత్తున ఇసుక నిల్వలను గుర్తించారు. అనధికారికంగా ఉండటంతో సమాచారం మేరకు మైనింగ్, సెబ్, రెవెన్యూ, పోలీసు అధికారులు దాడులు చేశారు. 29 వేల టన్నుల ఇసుకను సీజ్ చేసి ప్రభుత్వానికి అప్పగించారు.
- జూన్ 21న తెలంగాణ రాష్ట్రంలోని రాజోలి గ్రామ సమీపంలో ఆంధ్రరాష్ట్ర సరిహద్దులో ఉన్న తుంగభద్రలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు సమాచారం వచ్చింది. సంబంధిత అధికారులు దాడులు చేసి 51 ట్రాక్టర్లను సీజ్ చేసి జరిమానా విధించారు.
- జూలై 3న ఎదురూరు గ్రామంలో తెలంగాణకు చెందిన ట్రాక్టర్లు అక్రమంగా ప్రవేశించి ఇసుకను తరలిస్తుండగా దాడులు చేసిన మైనింగ్ అధికారులు 13 ట్రాక్టర్లను సీజ్ చేశారు. వాటిని స్థానిక రూరల్ పోలీసు స్టేషన్‌కు తరలించారు.
- జూలై 15న కోసిగి మండలం సాతనూరు గ్రామంలో అక్రమంగా 30 టన్నుల ఇసుకను నిల్వ చేసుకున్నారు. మైనింగ్, సెబ్, రెవెన్యూ, పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో దాడులు చేసి అక్రమ ఇసుకను, జేసీబీని సీజ్ చేశారు.
- జూలై 30న ఈ. తాండ్రపాడు వద్ద ఇసుక నిల్వను మైనింగ్ అధికారులు సీజ్ చేశారు.

ఉచిత ఇసుక పేరుతో మోసపోయాం



ఎన్నికల్లో ఓట్లు వేశాం. ఇసుక ఇబ్బందులు తీరుతాయి అనుకున్నాం. ఉచిత ఇసుక పేరుతో మోసపోయాం. ఇప్పుడు ఇసుక కొనలేని పరిస్థితి ఏర్పడింది. ఇదేం న్యాయం సార్. మాలాంటి సామాన్య ప్రజలకు ఇబ్బందులు తప్పావా..
– మధు, మునగాలపాడు

పీఎస్‌ల కొరత అధిగమించేలా..

- మ్యాపింగ్‌పై కొనసాగుతున్న కసరత్తు
- గ్రామ పంచాయతీలకు గ్రేడ్ –5 పంచాయతీ కార్యదర్శులు
- ఇన్‌చార్జ్ కార్యదర్శులకు తగ్గనున్న భారం
- డీడీఓగా పూర్తి స్థాయి బాధ్యతలు అప్పగించేందుకు చర్యలు
- ఇప్పటికే పంచాయతీల గ్రేడ్ల వివరాలను పంపిన డీపీఓ

ఎంత మంది పంచాయతీ కార్యదర్శులు ఉన్నారంటే	
గ్రేడ్ 1 ...	17
గ్రేడ్ 2 ...	03
గ్రేడ్ 3 ...	67
గ్రేడ్ 4 ...	137
మొత్తం ...	224

కర్నూలు(అర్బన్): గ్రామ పంచాయతీ కార్యదర్శుల(పీఎస్‌ల) కొరతను అధిగమించేందుకు జిల్లా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే డీడీఓ అధికారాలు చేపట్టిన గ్రామ సచివాలయాల్లోని గ్రేడ్–5 పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీఓ లాగిన్‌లో మ్యాపింగ్ చేసేందుకు కసరత్తు జరుగుతోంది. జిల్లాలో 484 గ్రామ పంచాయతీలకు 224 మంది కార్యదర్శులు మాత్రమే ఉన్నారు. ఈ నేపథ్యంలోనే 260 గ్రామ పంచాయతీలకు ఇన్‌చార్జ్ కార్యదర్శులు విధులు నిర్వహిస్తున్నారు. ఇన్‌చార్జ్‌లతో పాలన కుంటు పడుతుందని భావించిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామ సచివాలయాల్లోని గ్రేడ్ –5 పంచాయతీ కార్యదర్శులను కూడా డీడీఓ అధికారాలతో గ్రామ పంచాయతీలకు నియమించాలని నిర్ణయం తీసుకుంది. అంతలోపే సార్వత్రిక ఎన్నికలు రావడంతో ఈ ప్రక్రియ అమలులో కొంత జాప్యం చోటు చేసుకుంది. అప్పట్లోనే డీడీఓ అధికారాలను తీసుకున్న గ్రేడ్–5 పంచాయతీ కార్యదర్శుల పొజిషన్ ఐడీలను నేటికి సంబంధిత ఎంపీడీఓల సీఎఫ్‌ఎంఎస్ లాగిన్‌లో మ్యాపింగ్ చేయకపోవడంతో జీతాలు, నిధుల వ్యయం, బిల్లుల తయారీకి పలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం గ్రేడ్–5 పంచాయతీ కార్యదర్శుల వివరాలను ఎంపీడీఓ లాగిన్‌లో మ్యాపింగ్ చేయనున్నారు. కాగా ... గ్రామ సచివాలయాల్లో 193 మంది గ్రేడ్ –5 పంచాయతీ కార్యదర్శులు, 382 మంది గ్రేడ్ –6 (డిజిటల్ అసిస్టెంట్లు) విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంలో భాగంగా 193 మంది గ్రేడ్ –5 పంచాయతీ కార్యదర్శులను పూర్తి స్థాయి అధికారాలతో గ్రామ పంచాయతీలకు పంపుతున్నారు. ఇంకా 67 గ్రామ పంచాయతీలకు రెగ్యులర్ కార్యదర్శులను నియమించాల్సి ఉంది.


సీపీఆర్‌కు చేరిన పంచాయతీల గ్రేడ్ల వివరాలు ...

జిల్లాలోని గ్రామ పంచాయతీ గ్రేడ్ల వివరాలను జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం సీపీఆర్‌కు పంపింది. గ్రామ పంచాయతీల గ్రేడ్లను కూడా మార్చే యోచన ఉన్న నేపథ్యంలో ఆయా గ్రామ పంచాయతీలకు సంబంధించి 2011 జనాభా, మూడేళ్లగా ఆయా గ్రామ పంచాయతీలకు వస్తున్న తలసరి ఆదాయ వివరాలను పంపారు. పంపిన వివరాల మేరకు గ్రేడ్ –1గా 19, గ్రేడ్ –2గా 13, గ్రేడ్ –3గా 92, మిగిలిన 360 గ్రామ పంచాయతీలు గ్రేడ్ –4గా ఉన్నాయి. అయితే ప్రస్తుతం జనాభాను మినహాయిస్తే, పలు గ్రామ పంచాయతీలకు ఆదాయం పెరిగిన దృష్ట్యా గ్రేడ్లు మారే అవకాశాలు ఉన్నాయి. గ్రామ పంచాయతీల గ్రేడ్లు మారితే కార్యదర్శులకు కూడా స్థాన చలనం ఉంటుంది.



మద్దికెరలోని గ్రామ సచివాలయం

వేగంగా మ్యాపింగ్ చేస్తున్నాం ...



జిల్లాలో డీడీఓ అధికారాలు ఉన్నప్పటికీ ఎంపీడీఓల లాగిన్‌లో మ్యాపింగ్ కాకపోవడంతో కలుగుతున్న ఇబ్బందులను అధిగమించేందుకు చర్యలు చేపట్టాం. అందులో భాగంగానే గ్రేడ్–5 పంచాయతీ కార్యదర్శుల పొజిషన్ ఐడీలను ఎంపీడీఓ లాగిన్‌లో మ్యాపింగ్ చేసే ప్రక్రియను వేగవంతం చేశాం. ఈ ప్రక్రియ పూర్తి అయితే మెజారిటీ గ్రామ పంచాయతీల్లో పాలన సులభతరం అవుతుంది. 193 మంది గ్రేడ్–5 పంచాయతీ కార్యదర్శులను గ్రామ పంచాయతీలకు కేటాయించడంతో ప్రభుత్వ కార్యక్రమాలు కూడా వేగంగా అమలు అయ్యేందుకు అవకాశం ఏర్పడుతుంది.
– టీ నాగరాజునాయుడు, జిల్లా పంచాయతీ అధికారి